క్లుప్తంగా

సమస్యలు పరిష్కరిస్తాం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 21వ వార్డు పరిధిలోని శేషాద్రినగర్‌లో ఆదివారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా, వీధిదీపాలు, మురుగుకాల్వలు, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కాగా, స్థానికంగా నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి ప్రజలు తేగా.. ఎంపీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

చిన్నచింతకుంట: బండ్రపల్లి మాజీ సర్పంచ్ మహేష్‌గౌడ్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు ఆదివారం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు జానకిరాములు, వాకిటి యాదయ్య, కెంగూరి కృష్ణ, కోట్ల శ్రీనివాస్, మేస్త్రి నర్సింహులు, బొల్లు బాబు, నడిపన్నలతోపాటు పలువురు ఉన్నారు.

ఘన సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: పదవీవిరమణ పొందుతున్న ఏపీజీవీబీ చీఫ్ మేనేజర్ పరమేశ్‌ను ఆదివారం స్థానిక ఎంవీఎస్ కళాశాల మైదానంలో వాకర్లు, బీసీ సమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్‌సాగర్, వెంకట్రాములు, మురళీకృష్ణ, నారాయణ, రాంచంద్రయ్య, రఘు, విశ్వనాథ్, సాయి, నరసింహ, ఉమాపతి, వెంకటయ్య, ప్రదీప్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మంచిపనులతో ప్రజల హృదయాల్లో స్థానం

స్టేషన్ మహబూబ్‌నగర్: మనం చేసే మంచిపనులే ప్రజల హృదయాల్లో స్థానం ఇస్తాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యూబీగార్డెన్స్ యజమాని ఒబేదుల్లా షరీఫ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు రంజాన్ కిట్‌లు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పలువురికి కిట్‌లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ పండుగ సందర్భంగా ఒబేదుల్లా షరీఫ్ చేస్తున్న సామాజిక సేవ విలువ కట్టలేనిదన్నారు. ఇలాంటి సామాజిక సేవల్లో పాల్గొనేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, అబ్దుల్ హాదీ, జాకీర్ అడ్వకేట్, అజ్మత్‌అలీ, వెంకటయ్య, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జేజేఆర్ గార్డెన్స్‌లో ఆదివారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ, సియాసత్ ఎడిటర్ ఆమేర్ అలీఖాన్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్‌తోపాటు తదితర రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. అనంతరం మతపెద్దలు ప్రత్యేక దువా చేశారు. పలువురు నాయకులు ముస్లింలకు ఖర్జూర్, పండ్లు తినిపించారు. కార్యక్రమంలో జఫరుల్లా సిద్దిఖీ, ఏపీ.మిథున్‌రెడ్డి, సయ్యద్ ఇబ్రాహీం, మక్సూద్ హుస్సేన్, సీనియర్ ఉర్దూ జర్నలిస్టులు అబ్దుల్ జకీ, రఫీక్ పటేల్ పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్లకు బీటీ సొగసులు



జడ్చర్ల టౌన్: పట్టణంలోని 44వ నంబరు జాతీయరహదారిపై క్రాస్‌రోడ్డు నుంచి హైదరాబాద్ మార్గంలో ఇరువైపులా సర్వీస్‌రోడ్లకు బీటీ వేశారు. ప్రధానంగా క్రాస్‌రోడ్డు నుంచి హైదరాబాద్ మార్గంలోని సర్వీస్ రోడ్డు బీటీ వేయకపోవటం వల్ల వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతూ వచ్చారు. దానికి బీటీ వేయటంతో వాహనదారుల సమస్యలు తీరినట్లయ్యింది. మరో మార్గంలో ఉన్న సర్వీస్‌రోడ్డు కావేరమ్మపేట వాసులతోపాటు రింగ్‌రోడ్డు గ్రామాల ప్రజలకు అనువైన మార్గం. దీనిపై సైతం బీటీ వేయటంతో వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ బోర్లే దిక్కు

- అక్కడా నీటి లభ్యత అంతంతే!
- సోమ్లాతండాలో తాగునీటి కష్టాలు
- ఇబ్బందులు పడుతున్న గిరిజనులు



నిరుపయోగంగా చేతిపంపు



వ్యవసాయ బోర్ల నుంచి నీరు తెచ్చుకుంటున్న గిరిజనులు



రాజాపూర్: మండలంలోని మల్లేపల్లి గ్రామానికి అనుబంధంగా ఉన్న సోమ్లాతండాలో గిరిజనులను తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. గుక్కెడు నీటి కోసం వారు అవస్థలు పడుతున్నారు. 350కి పైగా జనాభా ఉన్న తండాలో ఓవర్‌హెడ్ ట్యాంకు ఉన్నా.. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో నిరుపయోగంగా మారింది. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా తమ కష్టాలు మాత్రం తొలగడంలేదని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ బోర్లే తమకు దిక్కయ్యాయని చెబుతున్నారు. పొలాల గట్ల వెంట నడుకొంటూ తాగునీరు తెచ్చుకొంటున్నామని చెబుతున్నారు. కాగా వేసవి రావడంతో పరిస్థితి మరింత దిగజారిందని.. వ్యవసాయ బోర్ల వద్ద కూడా భూగర్భ జలాలు అడుగంటడంతో అక్కడా నీరు దొరకడం లేదని వాపోతున్నారు. పొలాల వారికి సాగు చేసుకున్న పంటలు సైతం ఎండితున్నాయని చెబుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ముందుముందు ఇంకా ఎన్ని ఇబ్బందులు పడాల్సి వస్తదో అని తండావాసులు ఆందోళన చెందుతున్నారు. తమ సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఒక చేతిపంపు ఉన్నా అదికూడా పనిచేయకుండా పోయిందని.. అధికారులు స్పందించి తమ సమస్య తీర్చాలని కోరారు.

బోర్లవద్ద తెచ్చుకుంటున్నం

మా తండాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఎవరూ పట్టించుకోవడంలేదు. నల్లాలు సరిగా రావడంలేదు. ఒక చేతిపంపు ఉన్నా అదికూడా పనిచేయకుండా పోయింది. తప్పనిసరి పరిస్థితుల్లో వ్యవసాయబోర్ల వద్దకు పోయి బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్నం. అవి కూడా సరిగా రావడం లేదు.

– శారద, సోమ్లాతండా

నీళ్లమోత ఇంకెన్నాళ్లు

మా తండాలో తాగునీటి సమస్య ఎప్పుడు తీరుతుందో తెలియడం లేదు. తండాలో నల్లాలు ఉన్నా నీళ్లు రావడంలేదు. నాకు డెబ్బై ఏళ్లు వచ్చాయి. అయినా నీళ్ల మోత తప్పడం లేదు. అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీరు వచ్చేలా చేయాలి.

– బిన్కి, సోమ్లాతండా

గేట్‌వాల్వ్స్ లీకేజీలు ఉన్నాయి

సోమ్లాతండాలో ఉన్న ఓవర్‌హెడ్‌ట్యాంకు వద్ద గేట్‌వాల్వ్ లీకేజీలు ఉన్నాయి. వాటిని వాటర్ వర్క్‌వాళ్లు రిపేరు చేయించాలి. గ్రిడ్ వరకు మాత్రమే మాకు సంబంధం ఉంటది. తండాల్లో చేతిపంపులు, నీటి సరఫరా ఆర్‌డబ్ల్యూఎస్ వారు చూసుకోవాల్సి ఉంటుంది. గేట్‌వాల్స్ సరిచేస్తే ఇబ్బందులు తొలగుతాయి.

– మొగులాల్, గ్రిడ్ ఏఈ

ఆస్పత్రి కార్మికుల వేతనాలు విడుదల

జడ్చర్ల టౌన్: వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లలో పనిచేస్తున్న ఏజెన్సీ కార్మికులకు సంబంధించి 5నెలల వేతనాలు ఆదివారం విడుదల అయ్యాయి. దీంతో సోమవారం నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెను విరమిస్తున్నట్లు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ తెలియజేశారు. కార్మికులకు ఆరు నెలల నుంచి వేతనాలు రాకపోవటంతో ఏప్రిల్ 1 నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర రాజనర్సింహ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలు చొరవ తీసుకుని కార్మికులకు సంబంధించి 5 నెలల వేతనాలు విడుదల చేసేందుకు అంగీకరించారు. దీంతో సమ్మెను విరమించారు. ప్రభుత్వ నిర్ణయంపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబానికి సాయం

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామానికి చెందిన అనుపటి వెంకటమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందారు. కాగా బాధిత కుటుంబాన్ని బీజేపీ జిల్లా నాయకుడు మున్నూర్ రమేష్ ఆదివారం పరామర్శించారు. రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. జంగం యాదయ్య, అనుపటి మాసయ్య, జయమ్మ, అబ్దుల్, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

మైనార్టీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

స్టేషన్ మహబూబ్‌నగర్: మైనార్టీల అభ్యున్నతే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం రెమా వర్షిప్ చర్చ్‌లో పాస్టర్ బీఎస్.పరంజ్యోతి అధ్యక్షతన ఈస్టర్ వేడుకలు నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మైనార్టీల కోసం ఒక ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. అర్హులైన మైనార్టీలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధిలోకి రావాలని కోరారు. యేసుక్రీస్తు పంచిన ప్రేమను ఒకరిపట్ల ఒకరం పంచేవారంగా ఉందామన్నారు. పాస్టర్ పరంజ్యోతి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చైర్మన్ కొత్వాల్‌ను సంఘ పెద్దలు ఘనంగా సన్మానించారు. పెద్దలు దేవయ్య, భరత్, శ్యామ్ సుందర్, బల్‌రాం, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



కొత్వాల్‌ను ఘనంగా సన్మానించిన సంఘ పెద్దలు

ఆలయ నిర్మాణానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న సంతోష్‌చారి

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రామస్వామి గుట్టపై పురాతన కాలంలో వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి చైర్మన్ అస్కని నరేందర్ ఆదివారం హైదరాబాద్‌లో విరాళాలను సేకరించారు. హైదరాబాద్‌కు చెందిన టిస్లా గ్లోబల్ సర్వీస్ ఐటీ మేనేజర్ మునిగంటి సంతోష్‌చారి రూ.51,116వేలను విరాళంగా అందజేశారు. అదేవిధంగా హైదరాబాద్‌కు చెందిన జెడ్‌టీఈ టెలికం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సర్కిల్ హెడ్ మెరుగు సతీష్‌కుమార్‌రెడ్డి రూ.31,116వేలను విరాళంగా అందజేశారు. ఆలయాభివృద్ధికి దాతలు సహకరించాలని ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కోరారు.

కవులు, కళాకారులకు ఘనసన్మానం



అవార్డులతో కవులు, కళాకారులు

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి ఆలయ ప్రాంగణంలో ఉగాది నేపథ్యంలో బెల్లం సత్యమ్మ స్మారకార్థం సదరు ట్రస్ట్ వారు ఉమ్మడి పాలమూర్ జిల్లా కవులు, కళాకారులను ఆదివారం ఘనంగా సన్మానించారు. అనంతరం కవులు భీంపల్లి శ్రీకాంత్, వెల్దండ వెంకటేశ్వర్లు, శ్రీమతి అంబుజ, వీరారెడ్డి, బండారు సునీత, పద్మాలయాచార్య, అచంపేట వెంకటేష్, కొల్లాపూర్ హవని, వెంకటేష్, సమాజ సేవకులు, ఉత్తమ అధికారి కురుమన్న మాస్టర్ లకు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి, వాఖ్యాత బెల్లం సాయులు, సీనియర్ న్యాయవాది వి. మనోహర్ రెడ్డి, ఆలయ ఈఓ మధనేశ్వర్‌రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, మహబూబ్‌నగర్ డీటీ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మైసమ్మ సన్నిధిలో భక్త జనం

నవాబుపేట: మండల పరిధిలోని మైసమ్మ దేవాలయం చెంత ఆదివారం జన జాతర కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా భక్తుల రాకతో అడవి మొత్తం అమ్మవారి నామస్మరణ మార్మోగింది. కాగా వేసవి కావటంతో భక్తులు చెట్టు నీడలో ప్రకృతిని ఆస్వాదిస్తూ సేదాతీరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట రూరల్ : సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుండటంతో సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌ఐ ఆంజనేయులు సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలోని టౌన్ పీఎస్‌లో ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులతో ఆదివారం మాట్లాడి అవగాహన కల్పించారు. అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని, తెలియనివారికి సెల్‌ఫోన్ ఇవొద్దన్నారు. అనవసరమైన లింకులు మొబైల్‌కు వస్తే ఓపెన్‌చేయొద్దని, లాటరీ తగిలిందని, తక్కువ ధరలకు ఆన్‌లైన్‌లో వస్తువులు అమ్ముతున్నట్లు ప్రకటనలు చూసి మోసపొవద్దన్నారు. ఎక్కడైన అనుమానం వస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 193కు లేదా 100, 112లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అదేవిధంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ నారాయణ, కానిస్టేబుళ్లు శివ, సృజన, హోంగార్డులు పాల్గొన్నారు.



ప్రజలు ఓటుహక్కును వినియోగించుకోవాలి



మాగనూర్: ప్రజలు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని ఎస్‌ఐ ఎండీ అబ్దుల్ ఖాదర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని కొత్తపల్లి, వర్కూర్ గ్రామాల్లో పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ కోసమే పోలీసుశాఖ ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తుందని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో మనోధైర్యం కల్పించడంతోపాటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా ఇలాంటి ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో ప్రత్యేక పోలీస్ బలగాలతో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎండీ అబ్దుల్ ఖాదర్, కేంద్ర సాయుధ బలగాలు, హెడ్‌కానిస్టేబుల్ ఉమేష్, కానిస్టేబుల్ సాయికుమార్, ఖాజాపాషా తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత : కేసు నమోదు

మిడ్జిల్: మండల పరిధిలోని బైరంపల్లిలో బెల్ట్ షాప్ ద్వారా మద్యం విక్రయిస్తున్న గొడుగు సిరియాళ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అతడి దగ్గర 9 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆనంద్ వివరించారు. ఎన్నికల కోడ్ సందర్భంగా ఎవరైనా గ్రామాల్లో మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అయ్యవారిపల్లిలో ఇసుకటిప్పర్..

మిడ్జిల్: మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పరును పోలీసులు పట్టుకొన్నారు. ఈ మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆనంద్ వివరించారు. అక్రమ ఇసుక రవాణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గెలుపు కోసం పనిచేయాలి

పాలమూరు: మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్న అసెంబ్లీ వారీగా త్వరలో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేయనున్నట్లు అభ్యర్థి డీకే అరుణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఎస్సీ మోర్చా సమ్మేళనం సభ సన్నాహక సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలన్నారు. కేంద్ర సంక్షేమ పథకాలు గడపగడపకు తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి, బుడ్డన్న, విజయ్‌కుమార్, కృష్ణయ్య, కృష్ణ, కొంగళి శ్రీకాంత్ పాల్గొన్నారు.

దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

మహమ్మదాబాద్: దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. ప్రజా ఆశీర్వాద యాత్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని మహమ్మదాబాద్, కొలింపల్లి, కంచన్‌పల్లి, మొకర్లాబాద్, చౌదర్‌పల్లి, గాధిర్యాల్ తదితర గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాల అభివృద్ధి కోసం నిత్యం పనిచేస్తున్న నరేంద్రమోదీని దృష్టిలో ఉంచుకుని ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ చేవెళ్లలో ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాలకు గతంలో రాష్ట్రప్రభుత్వం పేర్లు పెట్టుకుని ప్రజలకు చేరువయ్యారని బీజేపీకి నష్టం చేశారని తెలిపారు. కేంద్రం పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి తెలియజేయాలని సూచించారు. నాయకులు, వెన్నె ఈశ్వరప్ప, గిరమోని శ్రీనివాస్, పార్టీ అధ్యక్షుడు కృష్ణ, శంకర్‌నాయక్, సురేష్, చౌదరిశ్రీను తదతరులు పాల్గొన్నారు. అదేవిధంగా గండేడ్ పరిధిలోని కొండారెడ్డిపల్లి, మన్సూర్‌పల్లి, లింగాయపల్లి, జిన్నారం తదితర గ్రామాల్లోనూ ఆయన పర్యటించారు.



మంగంపేట్‌లో దివ్యాంగుడికి నమస్కరిస్తున్న ఎంపీ అభ్యర్థి కొండావిశ్వేశ్వర్‌రెడ్డి

పాఠశాల అభివృద్ధికి సహకారం





హన్మసానిపల్లి పాఠశాల పరిస్థితి ఇలా..

- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సూచనతో స్పందించిన ఆయన మిత్రుడు

నవాబుపేట: మండల పరిధిలోని హన్మసానిపల్లి ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సూచనతో ఆయన మిత్రుడు ఆర్థికసాయం ప్రకటించారు. వివరాల్లోకి వెళ్తే.. 'హన్మసానిపల్లి పాఠశాలను చూస్తే బాధేస్తుంది. మారుమూల గ్రామం చిన్నపిల్లలకు ఆ బడి తప్ప వేరే అవకాశం లేదు. ఎప్పుడు కూలుతుందో తెలియదు. మీ వంతుగా పాఠశాల అభివృద్ధికి సహకరించండి' అంటూ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తన హైదరాబాద్ మిత్రుడు శ్రీకర్‌కు మెయిల్ ద్వారా, పాఠశాల ఫొటోలతో పాటు శనివారం సందేశం పంపించారు. దీంతో ఆయన స్పందించారు. తమ సంస్థ ఎంవైకే ఆర్మెంట్ ద్వారా టేకప్ చేస్తామన్నారు. రూ. 7.37 లక్షలు తక్షణం మంజూరు చేస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. దీంతో కొన్ని సంవత్సరాలుగా శిథిలావస్థలో ఉన్న పాఠశాల అభివృద్ధిలోకి రానుంది. దీంతో మండల ప్రజలు ఎమ్మెల్యేకు, ఆయన మిత్రుడికి ధన్యవాదాలు తెలిపారు.

క్రీస్తు మార్గంలో పయనించాలి



జడ్చర్లలో ఈస్టర్‌వేడుకలకు హాజరైన క్రైస్తవులు



జడ్చర్లలో ప్రసంగిస్తున్న రెవరెండ్ జయ ఏసుకుమార్

జడ్చర్ల టౌన్: ఏసుక్రీస్తు చూపిన మార్గంలో పయనించాలని రెవరెండ్ జయయేసుకుమార్ సందేశమిచ్చారు. ఆదివారం ఈస్టర్ సండే సూర్యోదయ ఆరాధనలో భాగంగా పట్టణంలోని కల్వకరికొండపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మరణమును జయించిన జయశీలుడు ఏసుక్రీస్తుగా కొనియాడారు. పునరుత్థానుడు క్రీస్తు మనకొరకు మరణించి తిరిగి లేచాడని, అందుకే ఆయన చూపిన శాంతి, ప్రేమ, క్షమాపణ, కరుణ గుణాలను అనుసరిస్తూ వాటిని పాటిస్తూ సమాజంలో నడుచుకోవాలన్నారు. క్రీస్తు చూపిన మార్గంలో పయనించటమే క్రైస్తవమన్నారు. సూర్యోదయ ఆరాధన అనంతరం యంబీ బేథని చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ రె. విలియంబూత్‌తోపాటు క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదే విధంగా క్రీస్తురాజు దేవాలయం, యంబీ సెంటినరి చర్చ్, పెంథకోస్ట్ చర్చ్‌తోపాటు గంగాపురం, కొండేడ్ గ్రామాల్లోనూ ఈస్టర్ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు.

చిన్నచింతకుంట: ఏసుప్రభు కృప ప్రజల అందరిపై ఉండాలని జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం చిన్నచింతకుంట మండల కేంద్రంలోని యంబీ సియోన్ చర్చ్‌లో ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి వంశీ చందర్‌రెడ్డితో కలిసి స్వర్ణసుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సుఖసంతోషాలతో, ప్రేమనురాగాలతో కలిసిమెలిసి మెలగాలని ఏసు ప్రభును ప్రార్థించాలన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే క్రైస్తవులకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందన్నారు. జీసెస్ కృపతో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం కల్పిస్తున్నారన్నారు. ప్రజలు ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. ఏసు కృపతో మీ అందరి ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా విజయం సాధించానన్నారు. ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అదేవిధంగా ఏసు ప్రభు చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచందర్ రెడ్డి అన్నారు. ప్రజలంత ఏసు ప్రభు మాదిరిగా ప్రేమ అనురాగాలను కల్గి ఉండాలన్నారు. ఆయన దారిలో నడిచేందుకు ఆప్రభువే మనకు శక్తిని ఇవ్వాలని అలాగే ప్రజలు సుఖసంతోషాలతో, ప్రేమనురాగాలతో మెలగాలని ప్రార్థించాలన్నారు. ఈ కార్యక్రమంలో చర్చ్ పాస్టర్ రెవరెండ్ గిద్యోన్, సంఘ సెక్రెటరీ యోన, ట్రెజరర్ సుదరశన్, వైస్ చైర్మన్ ప్రకాశం, ఎంపీటీసీ ఉషారాణి, మండల కోఆప్షన్ మెంబర్ మహమూద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు కొత్తకోట ప్రశాంత్, సురేందర్ రెడ్డి, ప్రదీప్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.



వేడుకల్లో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, వంశీచంద్‌రెడ్డి రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి తదితరులు



చిన్నచింతకుంటలో వేడుకలకు హాజరైన క్రైస్తవులు